విశాలాంధ్ర

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు

శనివారం 29 డిసెంబరు 2018 | 12 పేజీలు

# ఇంజినీరింగ్ విద్యలో నాణ్యత అవసరం

విశాలాంధ్ర-కాకినాడ : వ్యవస్థలో మార్పు తీసుకురాగలిగితే నాణ్యమైన విద్యను అందించడం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఛైర్మన్ ప్రొ.పి.ఉదయభాస్కర్ పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం కాకినాడ (జేఎన్‌టీయూకే) ఆవిర్భవించి 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జేఎన్‌టీయూకే ప్రాంగణంలో శుక్రవారం అలూమ్ని ఆడిటోరియంలో దశాబ్ది ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దశాబ్ది ఉత్సవ వేడుకలను అతిథులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన అనంతరం ముఖ్యఅతిథి ప్రొ.పి.ఉదయభాస్కర్ మాట్లాడుతూ తాను చదువుకుని ఉద్యోగం చేసిన యూనివర్శిటీ వేడుకలకు ముఖ్యఅతిథిగా రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇంజినీరింగ్ విద్యలో నాణ్యతను పెంచేందుకు, నైపుణ్యాల శిక్షణపై గురి పెట్టాలన్నారు. ప్రస్తుత పరిస్థితులలో మాతృ భాషను నిర్లక్ష్యం చేస్తున్నారని,



అందువలనే పోటీ పరీక్షలైన గ్రూప్-1లో తెలుగును తప్పనిసరి చేయడం జరిగిందన్నారు. సుమారు 85 శాతం విద్యార్థులు పరిశ్రమలకు అనుగుణంగా పనిచేసే నైపుణ్యం లేదని, దీన్ని అధిగమించేందుకు అధ్యాపకుల తోడ్పాటుతో పలు సంస్కరణలు చేపట్టాలన్నారు. కొత్తగా ఏర్పాటైన రాష్ట్రం వలన ఎన్నో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, విశ్వవిద్యాలయాలు అభివృద్ధి చెందితే సమాజానికి ఉన్నతమైన లక్ష్యాలతో కూడిన విద్యార్థులను అందించవచ్చునన్నారు. పీజీ విద్యలో పరిశోధనలకు, అండర్ గ్రాడ్యుయేట్‌లో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేలా పాఠ్య ప్రణాళిక రూపొందించాలన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఉపకులపతి ప్రొ.ఎం.రామలింగరాజు మాట్లాడుతూ ఇదే విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా, అధ్యాపకునిగా, డైరెక్టర్‌గా, ఉపకులపతిగా సేవలందించడం తన అదృష్టమన్నారు. మొట్ట మొదటి ఉపకులపతి ప్రొ.అల్లం అప్పారావు హయాంలో యూజీసీ నుంచి 12బి స్టేటస్‌ను తీసుకురాగా, రెండవ ఉపకులపతి ప్రొ.జి.తుల సీరాందాస్ హయాంలో జేఎన్‌టీయూ విజయనగరం కళాశాల ఏర్పాటు, జేఎన్‌టీయూకేలో మౌలిక సదుపాయాలు, భవనాల నిర్మాణాలపై దృష్టి సారించగా, మూడవ ఉపకులపతి ప్రొ.విఎస్ఎస్.కుమార్ హయాంలో జేఎన్‌టీయూ నరసారావుపేట కళాశాల ఏర్పాటు, ఇంక్యుబేషన్, రీసెర్చ్ ఇన్నోవేషన్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను అభివృద్ధిపరిచారన్నారు. అనంతరం జేఎన్‌టీయూకే విజయాలతో కూడిన సంచికను సీడీ రూపంలో విడుదల చేశారు.